RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:31 SUNDAY,JUNE 28,2026 PAGES:12 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :31 ఆదివారం, జూన్ 28, 2026, పేజీలు -12 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు..

**వర్షపు జల్లుల మధ్యే కూసుమంచి మండలంలో రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి**

**వానాకాలం రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారంగా వంతెనలు.. బీటీ రోడ్లు**

తెలంగాణ పత్రిక ప్రతినిధి: ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా.. వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా మిగతా2లో



## జూన్ ముగిసినా చుక్క నీరు లేదు..

**ప్రత్యేక పూజలతో వాన దేవుడిని వేడుకుంటున్న అన్నదాతలు** 2



## గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి

తెలంగాణ పత్రిక ప్రతినిధి: గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష మిగతా2లో

## అయోధ్య విరాళాల వివాదం..

## మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రియాంక్ ఖరే



-అయోధ్య విరాళాల వివాదంపై 'మన్ కీ బాత్'లో మోదీ మాట్లాడాలన్న ప్రియాంక్ ఖర్గే

-భక్తుల మనోభావాలతో బీజేపీ ఆడుకుంటోందని విమర్శలు

-సిట్ దర్యాప్తులో 8 మంది అరెస్ట్, రూ. 80 లక్షల నగదు స్వాధీనం

తెలంగాణ పత్రిక ప్రతినిధి: అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారంటూ కర్ణాటక హోం మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే తప్పుబటారు. ఈ అంశంపై ప్రధాని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పష్టత ఇవ్వాలని 2లో

## హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

-ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు 2

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ

-మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రయత్నాల మధ్య ఈ నియామకం ప్రాధాన్యం

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ అధికారి బి. అజిత్ రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు ఈ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



## హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులు ముందుకు సాగాలి

దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది.

తెలంగాణ పత్రిక ప్రతినిధి: ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ మిగతా2లో

## రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం



భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్

ఆలయ రూపురేఖలు మార్చేలా తొలి విడత అభివృద్ధి పనులు

వచ్చే ఏడాది శ్రీరామ నవమి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం

తెలంగాణ పత్రిక ప్రతినిధి: ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం మిగతా2లో



## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి

• చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన • తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ • శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుంద్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ వివరాలు2లో

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు



గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి

-ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి

-డ్రైవర్లను భాగస్వాములుగా చేసే సహకార నమూనాతో ఈ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్న అమిత్ షా

తెలంగాణ పత్రిక ప్రతినిధి : రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యం తో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్య కలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. మిగతా2లో

## ఇందిరమ్మ ఇళ్లు: స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

-నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం -500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యే స్లాబ్ ఉండాలని ఆదేశం -ముందువైపు మూడు అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు మించరాదని స్పష్టీకరణ -లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ 12

## 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ

సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ

పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని 2



## ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి

పాస్‌పోర్ట్, పౌరసత్వంపై ఒవైసీ వ్యాఖ్యలను ఖండించిన కిషన్ రెడ్డి

ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం

ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించవద్దని ఒవైసీకి హితవు



తెలంగాణ పత్రిక ప్రతినిధి: పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను మిగతా2లో

# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు..

వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

**రూ. 16.13 కోట్లతో శంకుస్థాపనలు..**

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు - ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులు ముందుకు సాగాలి

దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ...

భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు. భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అయోధ్య విరాళాల వివాదం.. మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రియాంక్ ఖర్గే

అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారంటూ కర్ణాటక హోం మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే తప్పుబట్టారు. ఈ అంశంపై ప్రధాని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పష్టత ఇవ్వాలని శనివారం ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురి అరెస్టులు జరగడం, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక సభ్యులు రాజీనామా చేయడంతో ఈ వివాదం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. విరాళాల సేకరణలో కోట్లాది రూపాయల అవకతవకలు జరిగాయని ఈ నెల ప్రారంభంలో సమాజ్‌వాదీ పార్టీ నేతలు ఆరోపించడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారులు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ సహాయకుడు రామశంకర్ యాదవ్‌తో సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా అధికారులు సుమారు రూ. 80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, నిష్పక్షపాత విచారణకు సహకరించేలా నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ, సిట్ దర్యాప్తులో నిజానిజాలు బయటపడతాయని, దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అయితే, 'రామభక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు' అన్న యోగి వ్యాఖ్యలపై ప్రియాంక్ ఖర్గే ఘాటుగా స్పందిస్తూ, "భక్తుల మనోభావాలతో ఆడుకుంది ఎవరు? ఈ కేసులో పట్టుబడింది మీ వాళ్లేకదా" అని బీజేపీపై విమర్శలు గుప్పించారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు, ఆటో-రిక్షాలు, ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది'' అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## జూన్ ముగిసినా చుక్క నీరు లేదు.. ప్రత్యేక పూజలతో వాన దేవుడిని వేడుకుంటున్న అన్నదాతలు



**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** గతేడాది జూన్ చివరికే చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోగా.. ఈసారి వర్షాభావంతో ఎండిన జలాశయాలు -- ఆందోళనలో రైతులు, ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం తెలంగాణలో ఈ ఏడాది వర్షాలు ఆలస్యమవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది. గత సంవత్సరం జూన్ నెలాఖరుకే రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, వాగులు నీటితో కళకళలాడగా, ఈసారి జూన్ ముగిసినా అనేక ప్రాంతాల్లో చుక్క నీరు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. వర్షాలు కురవాలని గ్రామాల్లో రైతులు వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు, యాగాలు, ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అన్నదాతకు అండగా వరుణుడు కరుణించాలి" అంటూ దేవాలయాల్లో మొక్కులు చెల్లిస్తున్నారు. వర్షాల కోసం రైతుల నిరీక్షణ రోజురోజుకూ పెరుగుతుండగా, చెరువులు నిండాలని, పంటలు పండాలని ప్రతి రైతు కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది. చెరువులు నిండితేనే రైతు ముఖంలో చిరునవ్వు... వరుణుడి కరుణ కోసం తెలంగాణ రైతాంగం ఎదురుచూపులు

# గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి

**అధికారులు సమన్వయం చేసుకోవాలి..**

జిల్లా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణేశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ప్లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం

ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి

కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

ప్రస్తుతం అజిత్ రెడ్డి పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని 'ఇన్వెస్ట్ తెలంగాణ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ (ఐడీఈఎస్) అధికారి అయిన అజిత్ రెడ్డికి, రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఈ కొత్త బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నగరంలో పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే క్రమంలో ఈ నియామకం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం సర్ఫరాజ్ అహ్మద్ హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమై మెట్రో రైలు విస్తరణపై చర్చించారు. మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ ప్రణాళికల కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ (ఎస్‌బీఐక్యాప్స్)ను కన్సల్టెంట్‌గా నియమించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

# ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి

తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు ఎదురవుతాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి తిరుగులేని ఆధారమని విదేశాంగ శాఖ స్పష్టం చేయనప్పటికీ, అది భారత పౌరులకు మాత్రమే అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జారీ చేసే అత్యంత కీలకమైన పత్రం" అని ఆయన పేర్కొన్నారు. బారిస్టర్ కోర్సు చదివిన ఒవైసీ, పౌరసత్వ చట్టం-1955, పాస్‌పోర్ట్ చట్టం-1967లను మరోసారి అధ్యయనం చేసి మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసర ఆందోళనలను సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఈ తాజా వివాదం తెలంగాణ రాజకీయాల్లో పత్రాల పరిశీలన, ఓటరు జాబితా సవరణ, పౌరసత్వం వంటి సున్నితమైన అంశాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

## శ్రీ రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవాలకు తూప్రాన్ సీఐ వెంకట్ రాజ్ గౌడ్‌కు ఆహ్వానం





**-ఆహ్వాన పత్రిక అందజేసిన వెల్దుర్తి గౌడ సంఘం నాయకులు**

**వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 27 (తెలంగాణ పత్రిక):**
వెల్దుర్తి మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈరోజు 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ 11వ వార్షిక మహోత్సవాలకు తూప్రాన్ సీఐ వెంకట్ రాజ్ గౌడ్,వెల్దుర్తి మండల తహసిల్దార్ విజయలక్ష్మి, వెల్దుర్తి, తూప్రాన్ ఎస్సైలు రాజు, గంగరాజు ను గౌడ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేసి, కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే వార్షికోత్సవాల్లో అమ్మవారి కల్యాణం, బోనాల ఊరేగింపు, గౌరమ్మ కార్యక్రమం, వివిధ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జగ్గశంకర్ గౌడ్, నాలాచెరువు కిష్టా గౌడ్, కోదండ కృష్ణ గౌడ్, అంగడిపేట సుధాకర్ గౌడ్, నాలాచెరువు నరసింహ గౌడ్, అంగడిపేట బిక్షపతి గౌడ్ శాకారం శ్రీనివాస్ గౌడ్, హనుమాద్రి బాలా గౌడ్, హనుమాద్రి లింగం గౌడ్, చింతకుంటసత్యనారాయణ గౌడ్, జగ్గ అశోక్ గౌడ్, హనుమాద్రి శ్రీనివాస్ గౌడ్, కోదండ శేఖర్ గౌడ్ మరియు గౌడ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యుత్ ప్రగతి భవన్లో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన




**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**జగిత్యాల జూన్ 27 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి**
జగిత్యాల నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పైన ఉన్న విద్యుత్ లైన్ ను ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలకు ఇబ్బంది కాకుండా షిఫ్ట్ చేయాలీ జగిత్యాల నియోజకవర్గం పరిధిలో గ్రామాల్లో తాగు నీటికి సరఫరాకు,ఖరీఫ్ లో పంట సాగుకు ఇబ్బంది కలగకుండా త్రీఫేస్ కరెంటును ఇవ్వాలి. మెడికల్ కాలేజీ కి నలువైపులా రోడ్డు పనులకు ఇబ్బందిగా ఉన్న కరెంటు పోల్స్ లను త్వరిత గతిన షిఫ్టింగ్ చేయాలని ,రోడ్డు పనులకు అవరోధంగా ఉన్నాయి.. వర్షాకాలంలో ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలీ. అర్హులకు 200 యూనిట్ల కరెంట్ అంది ంచే విదంగా చూడాలని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా పంట పొలాల్లో, గ్రామాల్లో ప్రజ లకు సమ స్య లేకుండా వంగిపోయిన, ఇరిగిపోయిన పోల్స్ ను త్వరిత గతిన మార్చే విదంగా చర్యలు తీసుకోవా లని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం లో ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సుదర్శనం, డిఈ గంగారం, ఎడిఈ లు జవ హర్ నాయక్, సిందూర్ శర్మ,ఎస్ఎఓ శ్రీనివాస్,ఏఈ లు,విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వెల్దుర్తిలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి 11వ వార్షికోత్సవాలు

**-ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్న రేణుకా ఎల్లమ్మ తల్లి**
**-భక్తుల రాకతో కళకళలాడనున్న వెల్దుర్తి**
**-అమ్మవారి దర్శనానికి భారీగా తరలిరానున్న భక్తులు**
**-సర్వాంగ సుందరంగా ఆలయ అలంకరణలు పూర్తి**
**-బోనాలు, హోమం, గౌరంగం, కల్యాణ మహోత్సవంతో మూడు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు**
**-భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గౌడ సంఘం పిలుపు**




**వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 27 (తెలంగాణ పత్రిక):**
వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం 11వ వార్షికోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి ఉత్సవాలను 28,29,30 మూడు రోజులపాటు పాటు అత్యంత వైభవంగా నిర్వహిం చనున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, బోనాల సమర్పణ, గౌరంగం, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల బోనాల ఊరేగింపు, గ్రామోత్సవం, భక్తుల మొక్కుల తీర్చడం, అమ్మవారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించడంజరుగుతుందని తెలిపారు. ఈ సందర్భ ంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ, రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఉత్సవాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. స్థానిక ప్రజలు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు ఉత్సవాల విజయవంతానికి సహకరిస్తున్నారని వారు తెలిపారు.

## సూర్యాపేట బిజెపి జిల్లా దళిత మోర్చా అధ్యక్షులుగా బొజ్జ పరశురాం మాదిగ నియామకం

**-రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు రామచంద్ర రావుకి, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చల్లా శ్రీలత రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన బొజ్జ పరశురాం మాదిగ**




**తెలంగాణ పత్రిక ,సూర్యాపేట, జూన్ 27**
ఈరోజు సూర్యాపేట జిల్లా ఎస్సీ మోర్చాబిజెపి పార్టీ అధ్యక్షులు గా ఎన్నికైనటువంటి బొజ్జా పరశురాములు మాదిగ గారిని కలిసి బనసంచ కాల్చి శాలువలతో సన్మానించి మిఠాయి లు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా బిజెపి నాయకులు ఆఫీస్ సెక్రెటరీ రవి వర్మ రెడ్డి, జిల్లా సీనియర్ బిజెపి నాయకులు దాసరి వెంకన్న యాదవ్, బీజేవైఎం నాయకులు ధరావత్ రవి నాయక్, జక్కుల రామచందర్ యాదవ్, జానకి రాములు గంగాధర, శివరాం తదితర పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సన్మానించడం జరిగింది. నూతనంగా ఎన్నికైన దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు బొజ్జ పరశురాం మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించినటువంటి రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు గారికి, సూర్యాపేట జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి గారికి, కడియం రామచంద్రయ్య గారికి, తుక్కాని మన్మధ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసే విధంగా కృషి చేస్తానని పార్టీ సూచించిన విది విధానాలను పాటిస్తూ పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తానని, తనపై నమ్మకం పెట్టిన పార్టీ కోసం నా శక్తి మేర పని చేస్తానన్నారు.తన నియామకానికి సహకరిం చినటువంటి పార్టీ శ్రేణులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బలవంతుల రాజు నియామకం



**ఆత్మకూరు, జూన్ 27: (తెలంగాణ పత్రిక):**
భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బలవంతుల రాజును పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. ఈ సందర్భంగా తనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మక్క, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తానని బలవంతుల రాజు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ, పార్టీ విస్తరణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

### ఎస్ఐఆర్ కార్యక్రమ అమలుపై బీఎల్ఏలతో సమీక్ష

**-పార్టీ శ్రేణులతో బొల్లోజు కుమారస్వామి**



**ఆత్మకూరు, జూన్ 27: (తెలంగాణ పత్రిక):**
పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరుపై బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి పార్టీ బీఎల్ఏలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం ఎలా కొనసాగుతోంది, ఓటరు జాబితాల పరిశీలన, ప్రజలకు అవగాహన కల్పించడం, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై బీఎల్ఏలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకత్వం సూచించిన విధంగా ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని బొల్లోజు కుమారస్వామి పిలుపునిచ్చారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ నిబద్ధతతో నిర్వర్తించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఉపసర్పంచ్ బాషబోయిన పైడి, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రవీణ్ రెడ్డి, బీఎల్ఏలు పొగాకుల సంతోష్, మందల తిరుపతి రెడ్డి, పార్శా రవీందర్, ఎర్ర తిరుపతి రెడ్డి, శ్రీరాంశెట్టి సుమన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో పై సమీక్ష

**-పల్స్ పోలియో విజయవంతానికి సమన్వయంతో పని చేయాలి: సిహెచ్ఓ , ఖాసిం అబ్బాస్**



**తానూర్: జూన్ 27(తెలంగాణ పత్రిక)**
తానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పల్స్ పోలియో పైన ఆశా కార్యకర్తలు, పర్యవేక్షకులు ఏఎన్ఎం లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు, రమ్య గౌడ్ మాట్లాడుతూ, ఈనెల 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. చుక్కల మందు వేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్ లు, ఇంటింటికి సందర్శనలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బోరుబావి మరమ్మతులకు వెళ్లిన కూలీపై పిడుగు.. వెల్దుర్తి వాసి మృతి

-వర్షం నుంచి తలదాచుకునేందుకు చెట్టు కిందకు వెళ్లగా విషాదం -- దరిపల్లిలో ఘటన



**వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 27 (తెలంగాణ పత్రిక):**
మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని దరిపల్లి గ్రామంలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన పానుగంటి మైసయ్య (40) వ్యవసాయ బోరుబావి మరమ్మతుల పనుల కోసం దరిపల్లి గ్రామానికి వెళ్లాడు. పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో తలదాచుకునేందుకు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో మైసయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు నమోదు చేసుకోవాలి

-వ్యవసాయ అధికారి యాదగిరి

**ఆత్మకూరు, జూన్ 27: (తెలంగాణ పత్రిక):**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి పి. యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ నెల 15 నుంచి సీసీఎల్ఏ ద్వారా భూభారతి పోర్టల్‌లో నమోదైన రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన వారికి ఇప్పటికే ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కాగా కొత్తగా పాసుబుక్కులు పొందిన రైతులు, గత సీజన్‌లో సాగు చేయని భూములను ఈ సీజన్‌లో సాగు చేస్తున్న రైతులు, నాలుగు ఎకరాలకు పైగా భూమి కలిగి ఉన్నప్పటికీ ఇంతవరకు రైతు భరోసా పొందని వారు, ఫోన్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ ఆధార్ నంబర్లు అనుసంధానమైన రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. నమోదుకు అవసరమైన పత్రాలు:
పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ
ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ
బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీ (ఖాతా వివరాలతో)
రైతు భరోసా దరఖాస్తు ఫారం
మొబైల్ నంబర్‌కు అనుసంధానమైన ఆధార్ వివరాలు
అర్హులైన రైతులు తమ గ్రామంలోని రైతు వేదిక కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 5, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే రైతులు రైతు రిజిస్ట్రీ లో తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

## భూమి ఉండగా టిపిఎస్ తరలింపు అన్యాయం

-ఎన్పీకే గ్రామాల ప్రజలు



**ఆత్మకూరు, జూన్ 27: (తెలంగాణ పత్రిక):**
నీరుకుళ్ల గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ, భూమి లేదనే కారణంతో పెద్దాపూర్‌కు తరలించే ప్రయత్నాలు చేయడం అన్యాయమని నీరుకుళ్ల, పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూభారతి రికార్డుల ప్రకారం సర్వే నంబర్--5లో 4 ఎకరాల 7 గుంటల ప్రభుత్వ భూమి స్పష్టంగా నమోదై ఉందని, అయినప్పటికీ అధికారులు ఆ భూమిని పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాల తరలింపునకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మూడు గ్రామాల విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీరుకుళ్లలోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల తరలింపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు రాస్తారోకోలు, వంటా-వార్పు, ధర్నాలు నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీరుకుళ్లలోనే పాఠశాల నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

# నీట్ పేపర్ లీకేజీపై యువజన కాంగ్రెస్ నిరసన

-కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 27, తెలంగాణ పత్రిక**
రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ ఆధ్వర్యంలో సిరిసిల్ల బ్రిడ్జిపై నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు బ్రిడ్జిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించడం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, కొందరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చుక్కా రాజశేఖర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. పరీక్షల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోతే యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు న్యాత నవీన్, రెడ్డిమళ్ల భాను, గుడిసె ప్రభాకర్, నాగం మురళి, శేఖర్ శౌర్య నాయక్, ఎడ్ల తిరుపతి, ధర్మపురి శ్రీనివాస్, పోగుల దేవరాజు రెడ్డి, ఎగుర్ల ప్రశాంత్, గంగోల్ల స్వామి, చుక్క రామస్వామి, దండుగుల శేఖర్, నక్క సాయి, ఎండీ సోహెల్, నక్క నవీన్, శ్యాగ కుమార్, రాగుల చరణ్, షేక్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో పాలన మరింత చేరువ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాలి





-ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల విజయవంతంపై జిల్లా యంత్రాంగానికి అభినందనలు

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 27, తెలంగాణ పత్రిక**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా పాలన ప్రజలకు మరింత చేరువైందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, వివిధ శాఖల పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన శైలజా రామయ్యర్‌కు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా యంత్రాంగం రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ప్రతి శాఖ తమ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను డాక్యుమెంటరీ రూపంలో భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి, డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు, రోడ్డు భద్రతలో భాగంగా సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అభినందించారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్ఓ జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పశువైద్య అధికారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవమే మా లక్ష్యం





-రాష్ట్ర అధ్యక్షులు కాదెపురం గంగన్న

**కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 27.**
తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవమే తమ లక్ష్యమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న పేర్కొన్నారు. దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న సామాజిక వివక్షను ఖండిస్తూ, అక్రిడేషన్ కమిటీలలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29వ తేది సోమవారం రోజున హైదరాబాద్‌లోని ఐ అ పి ఆర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ బలోపేతంలో భాగంగా కోటగిరి మండల కేంద్రానికి విచ్చేసిన అయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రిడిటేషన్ల విషయంలో దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రి డిటేషన్ కమిటీలలో ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యం కొనసాగుతోందని, దళిత, గిరిజన జర్నలిస్టులను పక్కన పెట్టే విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు అన్యాయం జరుగుతోందని అన్నారు. 2926లో ముగిసిన అక్రిడిటేషన్లను సంవత్సరాల తరబడి కొనసాగించడపై అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్ కమిటీలలో స్థానం కలిగించినప్పుడే దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న దళిత, గిరిజన జర్నలిస్టుల పిల్లలకు నూరుశాతం రాయితీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెద్ద పత్రికలు, చిన్న పత్రికలు, యూటూబ్ చానళ్ళు అని భేదం తీసుకొని వచ్చి, జర్నలిస్టుల మధ్య చిచ్చుపెట్టడం ప్రభుత్వానికి తగదని ఆయన అన్నారు. ఈ నెల 28వ తేదీలోగా తమ దళిత, గిరిజన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి అయన డిమాండ్ చేశారు. లేదంటే జరిగే ఎలాంటి నష్టానికైనా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అయన హెచ్చరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ చూపించిన మార్గంలోనే తాము నడుస్తున్నామని, అలాగని మా దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరిగితే మాత్రం ఊరుకునే ప్రసక్తేలేదని అయన ప్రకటించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టులు, దళిత, గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయ వాదులు తమ మద్దతును ప్రకటించి, పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ పిలుపునిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాగరి రాములు మోరే జీవన్ పుప్పల సైదయ్య గైక్వాడ్ రాము అర్జున్ భీమ్రావు యాదవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో విద్యా వ్యాపారమైంది

**-అరికట్టాలని డిఇఓ కార్యలయంలో వినతి**
**-పీ.డీ.ఎస్.యు జిల్లా కమిటీ డిమాండ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 27 (తెలంగాణ పత్రిక):**
సిద్దిపేట జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టి విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం డీఈవో ఆఫీసులో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రమేష్ మరియు ప్రధాన కార్యదర్శి బత్తిని ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక కార్పొరేట్,ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రైవేటు పాఠశాలల్లోనే పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, టై



బెల్టు బూట్లు తదితర వస్తువులను అమ్ముతున్నారని మండిపడ్డారు. శ్రీ చైతన్య, రాక్ వుడ్ తదితర పాఠశాలలు ఇంటర్నేషనల్ మరియు సీబీఎస్ఈ పేర్లతో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, తోకల పేర్లు పెట్టుకుంటే అట్టి పాఠశాలలను సీజ్ చేసే అధికారాలు మండల విద్యాశాఖ అధికారులకు ఇచ్చినప్పటికీ కూడా ఎంఈఓ చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. బ్రిలియంట్,ఎస్.ఆర్.కె, న్యూవిజేత, నిఖిలేశ్వరానంద పాఠశాలలకు షిఫ్టింగ్ అనుమతులు లేకున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు సిద్దిపేట జిల్లా కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థి,ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం.. క్వాలిటీ విద్య ఆశతో తల్లిదండ్రులపై అప్పుల భారం

**కొత్తగూడెం, జూన్ 27 (తెలంగాణ పత్రిక):**
ప్రైవేటు పాఠశాలల్లో మెరుగైన, నాణ్యమైన విద్య అందుతుందన్న ఆశతో తమ పిల్లలను చేర్పిస్తున్న తల్లిదండ్రులకు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాముల పేరుతో పెరుగుతున్న ఖర్చులు భారంగా మారుతున్నాయి. పిల్లల భవిష్యత్ కోసం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అప్పులు చేసి చదివించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెరుగుతున్న భారం - లెక్కల్లో చూస్తే**
సాధారణంగా ఒక విద్యార్థికి ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.25,000 నుంచి రూ.1,00,000 వరకు ఉంటోంది. దీనికి అదనంగా అడ్మిషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, ల్యాబ్ ఫీజు, స్పోర్ట్స్ ఫీజు, స్మార్ట్ క్లాస్ ఫీజు అంటూ రూ.15,000 నుంచి రూ.40,000 వరకు వసూలు చేస్తున్నారు.
ఇది కాకుండా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, షూస్, టై, బెల్ట్ అన్నీ స్కూల్ చెప్పిన షాపుల్లోనే కొనాలని నిబంధన పెడుతున్నారు. బయట మార్కెట్‌లో రూ.200 ఉన్న యూనిఫామ్ స్కూల్ ద్వారా రూ.800కి, రూ.1500 ఉన్న పుస్తకాల సెట్ రూ.4500కి అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ాఖ+, ఖఖ+ పిల్లలకు కూడా రూ.8,000 నుంచి రూ.12,000 వరకు బుక్స్, కిట్స్ పేరుతో వసూలు చేస్తున్నారు.

**తల్లిదండ్రుల ఆవేదన**
"నెలకు రూ.18,000 జీతం. ఇద్దరు పిల్లల స్కూల్ ఫీజుకే ఏడాదికి రూ.1,20,000 కట్టాలి. బుక్స్, యూనిఫామ్ అదనం. అప్పు చేయక తప్పడం లేదు" అని సుజాతనగర్‌కు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగి వాపోయారు.
"పిల్లాడికి మంచి ఇంగ్లీష్, కంప్యూటర్ వస్తాయని ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాం. కానీ ప్రతి నెల ఏదో





ఒక ఫీజు కట్టమంటున్నారు. ఫంక్షన్ ఫీజు, టూర్ ఫీజు, ప్రాజెక్ట్ ఫీజు అంటూ మానసికంగా వేధిస్తున్నారు" అని మరో తల్లి తెలిపారు.

**నిబంధనలు ఏం చెప్తున్నాయి?**
తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్, http://G.O.Ms.No.1 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు ప్రతి 3 ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫీజులు పెంచాలి. ఫీజు స్ట్రక్చర్‌ను ఙజూూ ఆఫీస్‌లో, స్కూల్ నోటీస్ బోర్డులో పెట్టాలి. పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్మడం, నిర్దిష్ట షాపుల్లో కొనమని చెప్పడం పూర్తిగా నిషేధం.
అయినప్పటికీ చాలా పాఠశాలలు ప్రతి ఏటా 10% నుంచి 20% ఫీజులు పెంచుతున్నాయి. ఫీజు నియంత్రణ కమిటీ ఉన్నప్పటికీ అమలు పారదర్శకంగా లేదనే విమర్శలు ఉన్నాయి.

**డిమాండ్ ఏమిటి?**
1. ఫీజు నియంత్రణ: జిల్లా స్థాయి ఫీజు నియంత్రణ కమిటీ ప్రతి స్కూల్ ఆడిట్ చేసి ఫీజు ఫిక్స్ చేయాలి.
2. పుస్తకాల దందా ఆపాలి: NCERT/CBSE పుస్తకాలే వాడాలి. స్కూల్‌లో అమ్మకాలు నిషేధించాలి.
3. కంప్లైంట్ సెల్: ఙజూూ ఆఫీస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి.
4. రసీదు తప్పనిసరి: వసూలు చేసిన ప్రతి రూపాయికి రసీదు ఇవ్వాలి.

విద్య వ్యాపారం కాకూడదు. పేద, మధ్యతరగతి పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అందాలంటే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యావేత్తలు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు చేయూత

**-అభినందించిన కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మయ్య**

**సిద్దిపేట/చిన్నకోదూరు, జూన్ 27 (తెలంగాణ పత్రిక):**
ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర స్టేషనరీ పంపిణీ చేయడం అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య అన్నారు. శనివారం హైదరాబాద్ కు చెందిన స్మెరా ఆర్థిక సహాయంతో సిద్దిపేట లయన్స్ క్లబ్, ఎస్పీఎల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.ఆరు వేల నోటు పుస్తకాలు, ఇతర స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామంచ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. రామంచ పాఠశాల అన్ని పాఠశాలలకు భిన్నంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట సురేశ్ కుమార్ దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులకు చేయూతనివ్వడం అభినందనీ యమన్నారు. ఎస్పీఎల్ వ్యవస్థాపకుడు లయన్ వినోద్ ముదాని




మాట్లాడుతూ రామంచ ప్రాథమిక పాఠశాలలో 2019లో రూ.14వేల విలువ గల నోట్ పుస్తకాలు , స్టేషనరీ పంపిణీ చేశామన్నారు. గత విద్యా సంవత్సరంలో రూ.ఐదు వేల విలువ చేసే నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేసామన్నారు. తాము అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సర్పంచ్ భవాని నవీన్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు దాతలు అందించే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు పాఠశాలకు వచ్చి బాగా చదువుకొని తల్లిదండ్రులు గ్రామానికి పేరుతేవా లన్నారు. పాఠశాలలో ఏ సమస్యలున్నా తన దృష్టికి వేస్తే వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రతినిధులు జోజి, పాండు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీత, ఆబేదాబేగం, నాగమణి, వరప్రసాద్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

**-నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి**



**నంగునూరు, జూన్ 27(తెలంగాణ పత్రిక):**
అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తుందని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేటలో శనివారం ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే



ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు అందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడంలో భాగంగానే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచి గోక మహిపాల్ రెడ్డి, సిద్ధన్నపేట ఉప సర్పంచి చిలుకల తిరుపతి రెడ్డి, వార్డు సభ్యుడు కందికట్ల రాజు, సిద్ధన్నపేట కారోబార్ పరకాల కనకారెడ్డి, ఇందిరమ్మ గృహ లబ్ధిదారుడు అనరాజుల కన్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బంగారి నర్సింలు, పంగ రాజశేఖర్ రెడ్డి, ఆదిమూలం మహేశ్, మూల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చండూరు సంతలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించి, కమిషనర్‌కువినతి పత్రం

**చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 27**
చండూరు మున్సిపల్ లో ప్లాస్టిక్ కావాలని నిషేధించిన నిషేధిం చడానికి ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు/జూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించుటకు చర్యలు తీసుకోవాలని వినతి. మహోదయులకు, మేము "మన



చండూరు మనం మార్చుకుందాం" అనే లక్ష్యంతో పనిచేస్తున్న చండూరు వాలా (జష్మ్రుఅఎబతీ ఔంశ్రీఖ) సభ్యులము. చండూరు శుక్రవారం సంతలో ప్రతి వారం పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా వినియోగించబడుతున్నాయి. దీనివల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు, కాలువలు మూసుకుపోవడం, చెత్త సమస్యలు అధికమవడం మరియు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో, చండూరు వాలా తరఫున శుక్రవారం సంతలో ప్రజలకు మరియు వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అందువల్ల, మున్సిపాలిటీ తరఫున క్రింది చర్యలు తీసుకోవలసిందిగా వినమ్రంగా కోరుతున్నాము: చండూరు శుక్రవారం సంతలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి. కూరగాయల వ్యాపారులు మరియు ఇతర విక్రేతలు తప్పనిసరిగా వస్త్ర సంచులు, జూట్ బ్యాగులు లేదా పర్యావరణ హిత సంచులను వెంట తీసుకురావాలని ఆదేశించాలి. కస్టమర్లకు అవసరమైన సందర్భంలో ఆ సంచులను అందించి, వాటి ధరను కూరగాయల ధరతో కలిపి లేదా విడిగా వసూలు చేసుకునే విధంగా అనుమతించాలి. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. ఈ చర్యల ద్వారా చండూరు పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దవచ్చని మా విశ్వాసం. కాబట్టి, పై విషయాలను పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకోవలసిందిగా మనవి చేస్తున్నాము. ధన్యవాదములతో, ఇట్లు, చండూరు వాలా సభ్యులు.

## గోపా కామారెడ్డిజిల్లా ఉపాధ్యక్షులుగా నాగరాజ్ గౌడ్

**కామారెడ్డి, జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**
గౌడ్స్ అఫీషియల్ & ప్రొఫెషనల్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షునిగా బిబిపేట మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన అంకన్నగారి నాగరాజ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శుక్రవారం రోజున జిల్లా కేంద్రంలో జరిగిన గోపా జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడంజరిగింది ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ గోపా



వేదికగా గౌడ కులస్థుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు నిరుపేద గౌడ విద్యార్థులకు విద్యా సహాయం అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారాలు' అందించడం వంటి కార్యక్రమాలను గోపా నిర్వహిస్తుందని యువతకు ఉపాధి కల్పించడం గోపా లక్ష్యమని ఆయన అన్నారు గౌడ కులస్తుల అభివృద్ధికి , ఐక్యతకు సహకారం అందించే దిశగా సమాజ సేవలో మరింత చురుకుగా పనిచేసే అవకాశం లభించిందన్నారు గోపా లో సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ సుప్రజ హాస్పిటల్ సహకారంతో హెల్త్ కార్డ్ లు రాష్ట్ర కమిటీ అందిస్తుందన్నారు నా ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన గోపా రాష్ట్ర కమిటీకి,గోపా సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి దారుణ హత్య

- రంగంలోకి దిగిన సిఐ భీమ్ కుమార్, ఎస్సై రమాదేవి
- పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్న వైనం



ఊర్కొండ జూన్ 27 (తెలంగాణ పత్రిక)

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రేవల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఘోర హత్య ఘటన చోటుచేసుకుంది.అదే గ్రామానికి చెందిన కర్రోల్ల యాదయ్య(45) హత్యకు గురి కావడం జరిగింది. శుక్రవారం సాయంత్రం సుమారు 8 గంటలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా యాదయ్య పై దాడి చేశారని సమాచారం. పదునైన మారణాయుధాలతో విచక్షణారహితంగా నరికి హత్యకు పాల్పడ్డారు.రక్తపు మడుగులో ఉన్న మృతుడిని గుర్తించిన గ్రామస్తులు, సమాచారం అందుకున్న సిఐ భీమ్ కుమార్,ఎస్సై రామాదేవి రంగం లోకి దిగి ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.అలాగే ఈ హత్యపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు.ఈ హత్యకు ప్రధాన కారణాలు ఏమై ఉంటాయో అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. గ్రామంలో మాత్రం క్షుద్ర పూజల అనుమానంతో హత్య జరిగి ఉండొచ్చని పలువురు అనుకుంటున్నారని సమాచారం.ఈ దారుణ హత్యతో రేవల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి ఒక్కసారిగా గ్రామం మొత్తం ఉలిక్కిపడేలా ఈ సంఘటన నెలకొంది. శనివారం రోజు క్లూస్ టీం తో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించడం జరిగింది. మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఈ హత్యకు పాల్పడిన వారిని చేదించి వారికి శిక్ష పడేలా పోలీసులు ఈ ఘటనపై విచారిస్తున్నారు.మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.

## చేనేత సంఘం అధ్యక్షుడికి సన్మానం



కామారెడ్డి, జూన్ 27, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాదోమకొండ మండల చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బత్తినిబత్తిని సిద్ధ రాములు నోదోమకొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ తరఫున సీతారాం మధు సన్మానం చేయడం జరిగినది ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ మాట్లాడుతూ 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రివర్యులు షబ్బీర్ అలీ సహకారంతో చేనేత కార్మికుల గురించి 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు 200 పింఛన్ మంజూరు చేయడం జరిగింది అదే పింఛన్లు కొనసాగుతూ నేడు 2000కు పెంచడం జరిగిందని వివరించారు. కొనసాగించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో దోమకొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీతారాం మధు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు మర్రి శేఖర్ , ఇందిరమ్మ కమిటీ మెంబర్ నగరపు నర్సింలు మైనార్టీ నాయకులు ఎండి కలీం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన షబ్బీర్ అలీ

కామారెడ్డి, జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



శనివారంఆదిలాబాద్‌లోని మహాలక్ష్మి నగర్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ , జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ,మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ , చైర్మన్ ఫహీం ఖురేషి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భ ంగా వారు లబ్ధిదారులతో మాట్లాడి, సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి , మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ , మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష , కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్‌జీయూకేటీ బాసర్ విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి ,జూన్ 27, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు వారి లక్ష్యాలకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో కామారెడ్డిజిల్లా పరిపాలన ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.దఈ సందర్భంగా శనివారం ఆర్‌జీయూకేటీ (బాసర్)లో విద్యను అభ్యసిస్తున్న కామారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థిని నిఖిత కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించి విద్యా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో విద్యార్థినికి రూ.10,000 విలువైన చెక్కును ఒడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందజేశారు. ఈ సహాయం పుస్తకాలు, అధ్యయన సామగ్రి, ప్రయాణం తదితర విద్యా అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలో నిలిపివేయకుండా, పట్టుదలతో ఉన్నత విద్యను కొనసాగించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థిని నిఖిత జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ ఆర్థిక సహాయం తన చదువును కొనసాగించేందుకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజన్న, నరసింహులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో కామారెడ్డిజిల్లా అధికారుల పనితీరు అభినందనీయం





-ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలులో
కామారెడ్డి జిల్లా ఆదర్శంగా నిలవాలి
-ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర

కామారెడ్డి ,జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలుపై నిర్వహించిన కామారెడ్డి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి విచ్చేసిన ప్రత్యేక అధికారి శ్రీమతి బి. విజయేంద్ర, కార్యదర్శి, ఎస్‌సీడీ, కార్యదర్శి, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఒ కమిషనర్, ఎస్‌సీడీ (ఎఫ్‌ఏసీ)కు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పూలమొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై 10 శాఖలకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి జిల్లా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో ముందంజలో నిలిపి మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రతి లబ్ధిదారుని వద్దకు చేరేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న మంచి కార్యక్రమాలు, విజయగా థలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కోరారు. 99 రోజుల కార్యాచరణలో చేపట్టిన పనులను శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటివరకు సమర్థవంతంగా పనిచేస్తున్న జిల్లా అధికారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలిగారని తెలిపారు. విద్యా రంగంలో అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలని, విద్యాశాఖ చేపడుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రతి అర్హ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా విస్తృత అవగాహన కల్పించి, తల్లిదండ్రులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచి, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాణ్యమైన విద్య, వసతి, భోజనం, ఇతర సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ హాస్టళ్లలో పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు దోమతెరలను వినియోగించడంతో పాటు అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. హాస్టళ్లలో ఏవైనా మరమ్మత్తుల అవసరం ఉంటే వెంటనే పూర్తి చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే, ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్. విగిరి, డీఎఫ్ఓ నిరాజ్, డిఆర్ఓ పాండు,ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేయాలి





-పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
-జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

పాపన్నపేట, జూన్ 27, (తెలంగాణ పత్రిక)

కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం వార్షిక తనిఖీలలో భాగంగా పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పెండింగ్, మిస్సింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో త్వరగా పరిష్కరించాలని, ఆస్తి సంబంధిత నేరాల నివారణకు బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని ఆదేశించారు. అలాగే సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్ వంటి సాంకేతిక వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దోమకొండ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర , జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

-బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ప్రత్యేక అధికారి, కలెక్టర్.

కామారెడ్డి ,జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను శనివారం జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర జిల్లా కలెక్టర్ లు సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినీలతో సహపంక్తి భోజనాలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ పాఠశాలలో విద్య, వసతి, ఆహారం, ఇతర సౌకర్యాలపై ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు, విద్యాభ్యాసం, వసతి, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు (హెల్త్ చెకప్‌లు) నిర్వహిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా దోమతెరలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, విద్యార్థులందరికీ యూనిఫాంలు అందజేశారా అని ఆరా తీశారు. యూనిఫాం వస్త్రం అందిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా కొలతలు తీసి కుట్టించి విద్యార్థులకు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకుంటూ, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. భోజనం చేస్తున్న విద్యార్థినులకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ, అన్నం తక్కువగా, కూరలు, ఆకుకూరలు, పప్పు, గుడ్లు వంటి పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడ్డించిన కూరలను పూర్తిగా తినాలని, ఆహారాన్ని వృథా చేయకూడదని చెప్పారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి ప్రతి విద్యార్థి సరైన మోతాదులో పోషకాహారం తీసుకునేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

# సింగూర్ సెగ్మెంట్‌లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే

-రీఛార్జ్ పిట్ల ఏర్పాటుకు ప్రత్యేక కమిటీ

కామారెడ్డి ,జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతిని ధి)



కామారెడ్డి జిల్లాలో గలసింగూర్ రిజర్వాయర్ నీటి లభ్యతను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు భూగర్భ జలాలను పరిరక్షించే దిశగా సింగూర్ సెగ్మెంట్ పరిధిలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలో ఉన్న 14 మండలాల గ్రామాల్లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ), జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ), జిల్లా భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక అభియంతతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గ్రామాల వారీగా చేతి పంపులు, బోర్‌వెల్లు, సింగిల్ ఫేజ్ మోటార్లు, గ్రామీణ తాగునీటి పథకాల సోర్స్‌లను క్షుణ్ణంగా సర్వే చేసి, నీటి వనరుల పరిస్థితిని అంచనా వేస్తుంది. సర్వే నివేదిక ఆధారంగా అవసరమైన ప్రాంతాల్లో రీఛార్జ్ పిట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించి, భూగర్భ జలాల పునరుద్ధరణతో పాటు తాగునీటి వనరుల స్థిరీకరణకు చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా శాశ్వత పరిష్కారాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# రేక్ పాయింట్‌ను సందర్శించి, క్రిబ్ కోయూరియా రేక్ చేరికను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లా కేంద్రం లోని రైల్వే స్టేషన్ లో శనివారం రేక్ పాయింట్‌ను సందర్శించి, క్రిబ్ కోయూరియా రేక్ చేరికను పరిశీలించారు. రైతులు యూరియా కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరాను సక్రమంగా నిర్వహించేందుకు ప్రభుత్వం యూరియా పంపిణీ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించి అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అవసరమైన మేరకే యూరియా అందజేయబడుతోంది. దీంతో ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను కూడా సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కామారెడ్డి రేక్ పాయింట్‌ను సందర్శించి, ఖ=×దీఎజూ యూరియా రేక్ చేరికను పరిశీలించారు. రిటైలర్లు అందరూ యాప్‌లో నిల్వలను తప్పనిసరిగా నిర్ధారించాలని, అలాగే యూరియా విక్రయాలు పూర్తిగా ఈ-పాస్ (పూూ) యంత్రాల ద్వారానే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గత వానాకాలంలో ఇదే సమయానికి 58,753 ఎకరాల్లో పంటలు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 8,346 ఎకరాల్లో మాత్రమే పంటలు నమోదయ్యాయి. అంటే గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం సాగు విస్తీర్ణం గణనీయంగా తక్కువగా ఉంది. అయినప్పటికీ, జిల్లాలోని రైతులు ఇప్పటివరకు 4.08 లక్షల యూరియా బస్తాలను కొనుగోలు చేయగా, గత ఏడాది ఇదే సమయానికి 3.30 లక్షల బస్తాలను మాత్రమే కొనుగోలు చేశారు. సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ యూరియా కొనుగోళ్లు పెరగడం గమనార్హం. ప్రభుత్వం ముందస్తుగా యూరియా లభ్యతను కల్పించడంతో రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ఎరువులను ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 1.58 లక్షల యూరియా బస్తాల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. రైతులు మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను పొందుతున్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోంది. అందువల్ల రైతులు యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీఎం మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ఏడీఏ కామారెడ్డి, జిల్లా నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి

మాడుగులపల్లి//నల్గొండ//జూన్ 27:(తెలంగాణ పత్రిక):-





మాడ్గులపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పీహెచ్సీ లలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కోరారు. శనివారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సీపీఎం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాడ్గులపల్లి మండలం ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్నప్పటికి నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరం అన్నారు. మండలం లోని ప్రతి ఉప కేంద్రానికి స్వంత భవనాలు నిర్మించాలని అన్నారు. తోపుచర్ల, పాములపహాడ్, ఆగామోత్కూర్, ఇందుగుల ఉప కేంద్రాలలో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ఉప కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఆగామోత్కూర్ గ్రామంలో గత 4సంవత్సరాల క్రితం పల్లె దావఖానా మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తి కాలేదన్నారు. ఉన్నత వైద్యాధికారులు వెంటనే ఆభవనాన్ని పరిశీలించి నిర్మాణం పూర్తి అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా అన్ని ఉప కేంద్రాలలో కరెంటు, టాయిలెట్స్, మంచి నీరు, తదితర సమస్యలు లేకుండా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పాములపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ మరియు ఇతర సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు మరియు ఆసుపత్రి మౌళిక సదుపాయాలు గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.వారి వెంట సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రొండి శ్రినివాస్, మండల నాయకులు దేవి రెడ్డి అశోక్ రెడ్డీ, పుల్లెంల శ్రీఖర్, పఠాని శ్రీను, తంగెళ్ళ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

-యోగా శిక్షకులు అజయ్

కామారెడ్డి ,జూన్ 27, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు ఆదేశాలతో అధ్యాపకులు విద్యార్థులకు యోగ శిక్షణ, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, యోగా శిక్షకుడు అజయ్ కుమార్ రెండు గంటల పాటు యోగా ఆసనాలు వేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే యోగా వలన కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు యోగా కోసం సమయం కేటాయించాలి అని సూచించారు. యోగా వలన ఆరోగ్యం తో పాటు మానసిక ధైర్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు. వీరేశం, సతీష్ లు మాట్లాడుతు యోగా ప్రాధాన్యత గురించి తెలియచేశారు. ఇక్కడ చదివే విద్యార్థులకు విద్య తో పాటు అన్ని రంగాలలో తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మల్లేశం, శ్రీకాంత్, అలంపల్లి శ్రీనివాస్, సరస్వతి, మనీషా, హారిక సిబ్బంది నరసయ్య, సోటేరియా పాల్గొన్నారు.

# అంబారీపేటలో ఘనంగా డాక్టర్ గునిగంటి ప్రభాకర్ రావు పుట్టినరోజు వేడుకలు



కామారెడ్డి ,జూన్ 27,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబర్పేట గ్రామంలో శనివారం సర్పంచ్ ఆరుట్ల కవిత అనిల్ ఆధ్వర్యంలో డాక్టర్ గునిగంటి .ప్రభాకర్ రావు జన్మదిన సందర్భంగా విద్యార్థిని విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వారి మేనకోడలు సురభి. నిర్మలసత్యం రావు చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు క్రీడా భాగానికి చెందిన వస్తువులను అందజేశారు, అలాగే స్కూల్ కొరకై సౌండ్ సిస్టం అందజేశారు. అనంతరం హరిజనవాడ ప్రైమరీ స్కూల్, జడ్పీహెచ్ఎస్ ప్రైమరీ స్కూల్, జడ్పిహెచ్ఎస్ స్కూల్ 370 మంది విద్యార్థిని విద్యార్థులకు, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయ బృందం, మరియు,ఉపసర్పంచ్ సత్య గుడ్ , స్కూల్ చైర్మన్ పద్మ, వార్డు సభ్యులు, ఈశ్వర్ గౌడ్, ఫిరంగి అశోక్, బిలకుర్తి నికిత, బుసపురం కవిత, గ్రామస్తులు పాల్గొని వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి , గ్రామం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెద్దపల్లి పోలీస్ వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి బీఆర్ఎస్ నాయకుడు ఆత్మహత్యాయత్నం

-పరమర్శించిన టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్



పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 27 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కల్లెపు సంపత్ రావు పెద్దపల్లి పోలీస్ వేధింపులకు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలుసుకున్న టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ కరీంనగర్ సన్ రైజ్ హాస్పిటల్ కి వెళ్ళి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు

## రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల పట్ల ఉదాసీనిత వైఖరీ ప్రదర్శించడం సరికాదులి

-ఫీజులను ఇష్టం వచ్చినట్లు పెంచుతూ విద్యార్థులను ఇబ్బందులు పెట్టడం సరికాదు.. బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 27:(తెలంగాణ పత్రిక):-



రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల పట్ల ఉదాసీనత వైఖరి ప్రదర్శించడం సరికాదని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక మిర్యాలగూడ పట్టణంలో బీసీ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అలా అయితేనే బడుగు బలహీన వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులను ఇష్టం వచ్చినట్లు పెంచుతూ పేద విద్యార్థులకు గుది బండగా మారాయని అన్నారు. విద్యాశాఖ అధికారులు చూచి చూడనట్లు ఈ విషయంలో వ్యవహరించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

## మాడ్గులపల్లి మండలంలో మమ్మురంగా ఎస్ఐఆర్

-ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోలు



మాడ్గులపల్లి నల్గొండ//జూన్ 27:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలసంఘంప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పక్రియ మాడ్గులపల్లి మండల వ్యాప్తంగా మమ్మురంగా కొనసాగుతుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాను పూర్తిగా ప్రక్షాళన చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడమే లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఓటరు జాబితాలో ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు, కుటుంబ సభ్యుల వివరాలు, మరణించిన ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి సమగ్ర సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. అదే విధంగా కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మండలం లోని తోపుచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పక్రియకార్య క్రమంలో భారత రాష్ట్ర సమితి మాడ్గులపల్లి మండలం షోషల్ మీడియా అధ్యక్షులు షేక్ మౌలాలి పాల్గొని మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రజలందరు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల మార్పులు, చిరునామా మార్పులు వంటి అంశాలను ఈ ఎస్ఐఆర్ ప్రక్రియద్వారాపరిష్కరించనున్నట్లుఅయనతెలిపారు. ప్రజలు తమ ఆధార్, గుర్తింపు కార్డులు తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితా లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోపుచర్ల 13 వ పోలింగ్ కేంద్రం బూత్ లెవల్ ఆఫీసర్ బొప్పని శోభ, ఓటర్లు షేక్ ఖాసీంబీ, షేక్ హుస్సేన్ బీ, షేక్ జారీనాబేగం, షేక్ హాసీనా, షేక్ ఫాజియా, షేక్ రేష్మా,తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు జూనియర్ కళాశాలల ఆఫిలియేషన్ గుర్తింపు వెంటనే పూర్తి చేయాలి

-తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్.

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 27:(తెలంగాణ పత్రిక):-



తెలంగాణ రాష్ట్రంలో విద్యా సంవత్సరం మొదలై 15రోజులు గడిచిపోతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలకు గుర్తింపు రాకపోవడంతో అయోమయంలో విద్యార్థులు ఉన్నారని ఇంటర్మీడియట్ బోర్డు వెంటనే ప్రైవేట్ కళాశాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ కళాశాలల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు పూర్తి చేయకుండా జాప్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఇంటర్మీడియట్ ప్రైవేట్ కళాశాలల (అఫిలియేషన్) గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. విద్యా హక్కు చట్టం కాపాడాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వం, ఇంటర్మీడియట్ బోర్డ్ పై ఉందని గుర్తు చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం ప్రైవేట్ కళాశాల అఫిలియోషన్ గుర్తింపు జాప్యం వల్ల విద్యార్థులు అయోమయం పడాల్సినపరిస్థితి తీసుకురావడాన్నీ తప్పు పట్టారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి దగ్గరనే ఉన్నందున తక్షణ చర్యలు చేపట్టి విద్యార్థులను గందరగోళం నుంచి తప్పించాలని కోరారు.

## జులై 3 నాటికి ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి







-ప్రతి అర్హ ఓటరికి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలి

-గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు బీఎల్‌వోలకు సహకరించాలి

-ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాలి.. ఒకటి రసీదుగా తిరిగి అందజేయాలి

-ప్రగతి నగర్‌లో ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి జూన్-27 ( తెలంగాణ పత్రిక )

ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జులై 3వ తేదీలోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షసంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4 వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జులై 3 నాటికి ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తిస్థాయిలో ముగించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందిస్తూ ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని తెలిపారు.ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో నింపించి స్వీకరించగా, మరో ఫారంపై స్వీకరణ ధృవీకరణ చేసి రసీదుగా ఓటరికి తిరిగి అందజేయాలని సూచించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందించేలా అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పట్టణ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది

-పట్టణమంతా చెత్తకుప్ప లావాలన్న పెరిగిన దోమలు

-అంటు వ్యాధులు ప్రబలే అవకాశ శీ

కామారెడ్డి , జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి పట్టణ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. వర్షాకాలం ఆరంభంతోనే పట్టణం అంతటా చెత్త కుప్పలు పేరుకు పోయి అంటు వ్యాధులకు నిలయంగా మారింది. ప్రధాన రహదారులే చెత్త కుప్పలు పట్టణంలోని ప్రధాన రహదారులే చెత్తతో అధ్వానంగా ఉంటే, వార్డుల్లోని గల్లీల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వివిధ కాలనీలు, వార్డుల్లో రోజుల తరబడి చెత్త తీయకపోవడంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ఫలితంగా స్థానికులు జ్వరాలు, విరేచనాలు, చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారుల పక్కన, దుకాణాల ముందు ప్లాస్టిక్ సంచులు, కొబ్బరి చిప్పలు, ఇతర వ్యర్థాలు రాశులుగా పడి ఉన్నాయి. చెత్తను తినేందుకు ఆవులు, దూడలు రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. ప్లాస్టిక్ తిని మూగజీవులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. నియంత్రణ లేకపోవడంతో మూగ జీవులకు ముప్పు పొంచి ఉంది. ప్రధాన రహదారులపై చెత్త కుప్పలు కనిపిస్తుండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. చెత్త తరలింపు వాహనాలు సక్రమంగా తిరగకపోవడం, పారిశుద్ధ్య సిబ్బంది కొరతతో పట్టణ పరిశుభ్రత పూర్తిగా దిగజారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఓపెన్ ప్లాట్ యజమానులు ప్లాట్లను శుభ్రంగా ఉంచుకోవాలి

-మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 27 ( తెలంగాణ పత్రిక )



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఢ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు నెల రోజులపాటు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు 31వ వార్డ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించారు ముందుగా చైర్మన్ కి కౌన్సిలర్ మంథని నర్సింగ్, వార్డు ప్రజలు శాలువ కప్పి స్వాగతం పలికారు అనంతరం కౌన్సిలర్ ముత్యాల పోచమ్మ గుడి వద్ద ఉన్న ఓపెన్ ప్లాట్ ఉండడం వల్ల పందుల స్వైర్య విహారం చేస్తున్నాయని దానివల్ల వార్డు ప్రజలు,రోడ్డున వెళ్లే వారు, గుడికి వచ్చే భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కొన్ని చోట్ల మురికి కాలువలు కూలిపోయి మురికినీరు రోడ్డు పైకి వస్తున్నాయిని చైర్మన్ కి విన్నవించారు.ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడతూ పట్టణంలోని ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి ఓపెన్ ప్లాట్ యజమానులు మీయొక్క ఓపెన్ ప్లాట్లను చెట్లు, ముల్లపోదలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలం దృష్ట్యా వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్త పడాలని వర్షపు నీరు నిలిచి వార్డు ప్రజలు రోగాల బారిన పడతారని, ఓపెన్ ప్లాట్లలో చెత్త వెయ్యరాదని ఇబ్బందులకు గురవుతారని అన్నారు అలాగే మురికి కాలువలు కూలిపోయిన చోట యుద్ధ ప్రాతిపదికన మురుకికాలువలు నిర్మిస్తామని అన్నారు దయచేసి ప్రతిఒక్కరు మీఇండ్లలో వెళ్లే చెత్తను తడి-పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందజేయాలని అన్నారు అనంతరం ముత్యాల పోచమ్మ అమ్మవారి, వార్డు కౌన్సిలర్ ఆలయకమిటీ సభ్యులు చైర్మన్ ని శాలువాలతో సన్మానించారు ఈకార్యక్రమంలో కౌన్సిలర్ మంథని నర్సింగ్,వార్డ్ ఆఫీసర్ అనూష , వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు,ఫిట్టర్ మహేష్, ఎలక్ట్రిషన్ శ్రీకాంత్,ఆర్పీ మంజుల ,శానిటేషన్ సిబ్బంది సలిగంటి పోచమ్మ, అవునూరి సదయ్య,నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్,వార్డు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవం

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 27 ( తెలంగాణ పత్రిక )



శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలను ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువకులు, శివాజీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఛత్రపతి యువసేన వ్యవస్థాపకులు శివంగారి సతీష్ కుమార్, జడల సురేందర్ ప్రారంభించారు. అనంతరం శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివంగారి సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, దేశభక్తి, ధర్మ పరిరక్షణ, సమర్థ పరిపాలన నేటి తరానికి ఆదర్శమని అన్నారు. యువత శివాజీ మహారాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవ, జాతీయ భావన, క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వక్తలు శివాజీ మహారాజ్ హిందూ స్వరాజ్య స్థాపన కోసం చేసిన కృషి, రాజనీతిజ్ఞత, పరిపాలనా దూరదృష్టి, ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలను గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమాజంలో ఐక్యత, దేశభక్తి, విలువలు బలోపేతం అవుతాయని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమం సందర్భంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక సాంస్కృతిక, స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాల్గొన్న అతిథులు, యువకులను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్, హన్మంతునిపేట ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్, శివంగారి రాజేష్ కుమార్, రాధాస్వామి, రాజేం, మహంత్ కృష్ణ, చంద్రశేఖర్, దయాకర్, హరీష్, మహేష్, శ్రవణ్, తిరుమల్, నరేందర్, భూత్కూరి రాజేష్, మనుక శ్రీనివాస్, రెవెల్లి సందీప్, పిట్ట వినయ్, మహేష్ వంశీ, రంజిత్, మహేందర్, లక్ష్మణ్, రాము, శివ, రాకేష్, సంతోష్, సాగర్, కౌశిక్, బంటీ, బబ్లు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయం వద్ద బోరు కు భూమి పూజ

కామారెడ్డి ,జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో ఆ ప్రాంత నీటి సమస్యను తీర్చుటకు ప్రజలు కోరిన మీదట బోరు మంజూరు కాగా శనివారం స్థానిక సర్పంచ్ ఐరన్ నరసయ్య ఆధ్వర్యంలో బోరు పూజ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొమ్మల శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు బత్తిని సిద్ధ రాములు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం మధు, వార్డు సభ్యులు ఐరన్ లతా రాజేందర్, సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యతనివ్వాలి





**-పెద్దపల్లి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి,ప్రతినిది జూన్ 27 ( తెలంగాణ పత్రిక )

అభ్యసన ఫలితాలు పనితీరు గ్రేడింగ్ సూచికలు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్, సమర్థవంతమైన తరగతి గది బోధనపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.?శనివారం పెద్దపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులు స్వతంత్రంగా చదవడం, మాట్లాడడం నేర్చుకున్న అంశాలను సృజనాత్మకంగా వ్యక్తపరిచేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి పాఠశాలలో వార్షిక విద్యా ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక,పాఠ్య ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రెమెడియల్ బోధన అందించాలని స్పష్టం చేశారు. డిజిటల్ వనరులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆ సమాచారాన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. శాఖ మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయుల బోధనా ప్రక్రియను మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అకాడమిక్ ప్యానల్ తనిఖీ బృంద సభ్యులను కలెక్టర్ పరిచయం చేయగా, హాజరైన ఉపాధ్యాయులకు అకాడమిక్ ప్లానింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుండి సుమారు 1000 మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.?ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా విద్యా శాఖా ఏఎంఓ డాక్టర్. పి.ఎం. షేక్, సెక్టోరల్ అధికారులు మల్లేశ్, జిసిడిఓ కవిత, అలోకిట్, ఆర్పీ సమీర్, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో క్రిశాంక్ అన్న పోరాటాన్ని ఆపలేరు సోషల్ మీడియా వారియర్స్ కు ఆయనే స్ఫూర్తి




**-బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్**

పెద్దపల్లి,ప్రతినిధి జూన్ 27 ( తెలంగాణ పత్రిక )

“కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, వారి స్కామ్‌లను సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నందుకే బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, డాక్టర్ మన్నె క్రిశాంక్ పై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందనీ, కానీ జైలు గోడలు క్రిశాంక్ అన్న పోరాట పటిమను ఆపలేవు అని బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్ స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంలోని స్ఫూర్తి దివ్యాంగుల కేంద్రంలో ఉప్పు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మన్నె క్రిశాంక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి, వారికి పండ్లు పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా ఉప్పు రాజ్ కుమార్ మాట్లాడుతూ క్రిశాంక్ పోరాటాన్ని అభినందించారు. “ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడిగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రిశాంక్ కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఎంతో సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారన్నారు. కేవలం రాజకీయాల్లోనే కాకుండా, ఉన్నత చదువుల్లోనూ రాణించి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించడం మనందరికీ గర్వకారణం అన్నారు.అధికార పార్టీ చేస్తున్న తప్పుడు పనులను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచుతున్నారనే కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను వేధించాలని చూసినా, జైల్లో పెట్టినా భయపడకుండా, వెనకడుగు వేయకుండా బెయిల్ పై వచ్చిన మరుసటి రోజు నుండే మళ్లీ ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న వ్యక్తి క్రిషన్ కొనియాడారు. కేసీఆర్ కేటీఆర్ ఆలోచనా విధానంతో ముందుకు సాగుతూ.. తెలంగాణలోని లక్షలాది మంది బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ కు ఆయన నిజమైన స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు.?”ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడి క్రిశాంక్ చేస్తున్న పోరాటం అమోఘం. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజా సేవలో వారికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అని ఉప్పు రాజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లవన్ కుమార్, పల్లె మధు, ప్రేమ్ కుమార్, పెంచాల శ్రీకాంత్, పూదరి అనిల్ కుమార్, బైరం నటరాజ్, కుక్క మనోజ్, నారగోని శివ, మహేష్ కుమార్, మనోజ్ కుమార్ లతోపాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# పెన్షనర్లు ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం

**-టాప్రా జిల్లా అధ్యక్షులు జగదీష్ చంద్ర**

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 27:(తెలంగాణ పత్రిక):-

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకరంగా జూన్ 25న ప్రారంభించన ఇన్సూరెన్స్ పథకం పెన్షనర్లకు ఎలాంటి ఉపయోగం లేదని టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్ చంద్ర తెలిపారు. శనివారం నాడు స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు లక్షల సుమారు మూడు లక్షల మంది పెన్షనర్లు ఉన్నారని వారి గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారు చెప్పారు. ప్రభుత్వం ప్రకటిస్తున్నట్టు ఒక కోటి 20 లక్షలు పెన్షనర్లకు వర్తించదని , ఫైనాన్స్ శాఖ వారు ప్రకటించిన యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ విధి విధానాల్లో ఉందని వారు తెలిపారు. కేవలం సెంట్ సత్కార్ బ్యాంకు వారు 15లక్షల నుండి 30 లక్షల వరకు, ఇండియన్ బ్యాంక్ వారు 60 లక్షలు వరకు యాక్సిడెంటల్ పాలసీ, పెన్షన్ 40,000 పైగా వస్తుంటే వారికి కోటి రూపాయలు (చనిపోతే) ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోందని .వారికొస్తున్న పెన్షన్ ఆధారంగా కూడా యాక్సిడెంట్ పాలసీ రూపొందించారని తెలిపారు. ఇది పెన్షనర్లకు ఏ విధంగానూ ఉపయోగం లేదని,70 సంవత్సరాల వయసు దాటిన వారికి ఇది అసలు ఉపయోగపడదని వివరించారు. పెన్షనర్లందరూ నూతన హెల్త్ పాలసీ కి సంబంధించి విధివిధానాలు ఎప్పుడు విడుదల అవుతాయో అని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని. పెన్షన్ నందు 1.5% కోత విధించినా నోరు మెదపక భవిష్యత్తు బాగుంటుందని ఆశపడ్డ వారికి మిగిలింది అన్నారు. రెండు రోజుల్లో, వారం రోజుల్లో స్వేచ్ఛగా ఏ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవచ్చని ఆశ పడ్డార వారికి నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం చెప్పిన మాటలు ఇప్పుడు నీటి మీద రాతల్లా మారాయని. ఇంకొక ఐదు రోజుల్లో పెన్షన్ నుంచి మరొక సారి 1.5% కోతకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రాష్ట్రాల్లో ఉన్నటువంటి హెల్త్ పాలసీని పరిశీలించామని, దానిలో మెరుగైన విధానాన్ని ఇక్కడ అమలుపరుస్తామని చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో మారుమోగిపోతున్నాయని విధి విధానాలు రూపొందించడానికి సంవత్సరాలు పడతాయా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను రూపొందించింది. ఐదు డిఏలు, పే రివిజన్ కమిటీ రిపోర్టు అవన్నీ ఇప్పుడు చర్చల్లో లేవు, మాయమైపోయాయని అసలు విషయాలను పక్కదారి పట్టించేందుకు ఇన్సూరెన్స్ అని కమిటీ అని కాలయాపన చేస్తున్నారని తెలిపారు.అందరూ ఎదురు చూడటమే తప్ప ఫలితం మాత్రం శూన్యమని జాయింట్ యాక్షన్ కమిటీ క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ఉద్యోగుల, పెన్షనర్ల, ఉపాధ్యాయుల, అభిప్రాయాలను గమనంలోకి తీసుకొని కార్యక్రమాన్ని రూపొందించాలని వారు కోరారు. సమావేశంలో ఆయనతోపాటు టాప్రా నాయకులు మల్లు గౌతంరెడ్డి ముత్యాల లక్ష్మీనారాయణ వాడపల్లి రమేష్ పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన బొడ్రాయి మొదటి వార్షికోత్సవ ఉత్సవాలు

మంగపేట,జూన్ 27 (తెలంగాణ పత్రిక)



మండలంలోని చెరుపల్లిలో మూడు రోజులుగా కొనసాగుతున్న బొడ్రా యి మొదటి వార్షికోత్సవ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవా ల్లో భాగంగా మూడవ రోజు పూజారి నరేశ్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 06 గంటల నుంచి బొడ్రాయి మరియు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలు తలపై ఎత్తుకుని బొడ్రాయి, గ్రామ దేవతలకు సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని, డప్పు చప్పుళ్లతో వందలాదిగా ఒకేసారి తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# పిడుగు పడి రైతు మృతి

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 27



చిన్నశంకరంపేట: పిడుగు పాటుకు ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిన్న శంకరం పేట మండలంలోని ధరిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వెల్దుర్తి గ్రామానికి చెందిన పానుగంటి మైసయ్య (40) చిన్నశంకరంపేట మండలం ధరిపల్లి గ్రామంలో వ్యవసాయ బోరు బావి మరమ్మతుల పనులకు వచ్చినట్లు తెలిపారు. మరమ్మతులు చేస్తుండగా, వర్షం తోపాటు ఉరుములు మెరుపులు రావడంతో తల దాచు కోవడానికి చెట్టు వద్దకు వెళ్లగా,అదే సమయంలో పిడుగుపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య లక్ష్మి ఒక కూతురు ఉంది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బౌండ్ ఓవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి రూ.25,000 జరిమానా

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 27

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, నేరాలకు పాల్పడే నేరస్థులపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల కఠిన చర్యలు, బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన అవుల వెంకటరెడ్డి (తండ్రి: దివంగత రామసుబ్బారెడ్డి), లారీ మరియు జేసీబీ యజమాని, గతంలో బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతని చట్టవిరుద్ధ కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని, 20-05-2026న అతడిని నివారక చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకుని, గౌరవనీయ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, బూర్గంపాడు వారి ఎదుట హాజరుపరిచి, ఆరు నెలలపాటు సత్ప్రవర్తన పాటించాలని బౌండ్ ఓవర్ చేశారు. అయితే, బౌండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘిస్తూ 05-06-2026న పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెం.229/2026లో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 318(4), 329(3), 303(2) ప్రజా ఆస్తుల ధ్వంస నిరోధక చట్టం (టిడిపి పి యాక్ట్) సెక్షన్-3 కింద నమోదైన కేసులో ఏ-2 నిందితుడిగా పాల్గొన్నాడు. దీంతో, బౌండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై రూ.25,000/- జరిమానా విధించి, వసూలు చేయడం జరిగింది బౌండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై, అలాగే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే నేరస్థులపై కఠిన చర్యలు కొనసాగుతాయి పోలీసు వారు హెచ్చరించారు .

# ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల శాతం పెరగాలి

**-ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం**

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 27



చిన్నశంకరంపేట: ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుతో అంగన్వాడి కేంద్రాలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని జంగరాయ్ సర్పంచ్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆవుల గోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం చిన్న శంకంపేట మండలం పరిధిలోని జంగరాయి గ్రామంలో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకురావద్దని సూచించారు. అలా తీసుకువస్తే అంగన్వాడి కేంద్రాలు నిర్వీర్యం అవుతాయని అభిప్రాయపడ్డారు. మండల విద్యాధికారి దీప్లా రాథోడ్ మాట్లాడుతూ,ప్రీ ప్రైమరీ పాఠశాలలు విజయవంతంగా కొనసాగాలంటే విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి బోధన చేస్తూ వారి ఆలనా పాలన చూసుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు నాలుగు సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు పంపించాలని కోరారు. అనంతరం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రధానోపాధ్యాయుడు శాలువాతో సత్కరించి అభినందించారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం ఒక్క చిన్నారి కూడా మిస్ కాకూడదు

-ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారి డాక్టర్ తరుణ్ పిలుపు..!

-ఈ నెల 28, 29, 30 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం



ఆళ్లపల్లి// తెలంగాణ పత్రిక ప్రతినిధి //జూన్ 27

పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "నిండు జీవితానికి రెండు చుక్కలు" పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తరుణ్ పిలుపునిచ్చారు. శనివారం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28, 29, 30 తేదీల్లో మండలవ్యాప్తంగా మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆళ్లపల్లి మండల పరిధిలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు 946 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో చిన్నారులకు ఉచితంగా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి కారణాలతోనూ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో పూర్తిగా నివారించగల వ్యాధి అని, చిన్నారులకు సమయానికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా జీవితాంతం అంగవైకల్యం బారిన పడకుండా రక్షించవచ్చని డాక్టర్ తరుణ్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సూపర్వైజర్ రామకృష్ణ, ఫార్మసిస్ట్ రమేష్, హెల్త్ అసిస్టెంట్లు నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బొట్టు శీను కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డి జిల్లా ప్రతిని తెలంగాణ పత్రిక

.సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పంచముఖి హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ దాసుజూ బొట్టు శ్రీనివాస్ మాతృమూర్తి అకాల మరణం వల్ల సంతాపం తెలియజేస్తూ బొట్టు శ్రీను నుమరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చిన కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కారంగుల అశోక్ రెడ్డి సిడిసి చైర్మన్ పండ్ల రాజుమాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ బుజ్జి మాజీ కౌన్సిలర్ కోయల్కర్ కన్నయ్య మాజీ కౌన్సిలర్ విష్ణు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరామర్శించడం జరిగినది.

# అదిలాబాదులోమైనార్టీ గురుకుల బాలుర పాఠశాల ప్రారంభించిన మంత్రులు

-ప్రభుత్వసలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి, జూన్ 27,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ఆదిలాబాద్‌లో మైనార్టీ గురుకుల బాలుర-2 విద్యాలయాన్ని 20కోట్ల తో ,జూనియర్ కాలేజ్ రెసిడెన్షియల్ స్కూల్ 20 కోట్లతో నిర్మాణం పూర్తి చేసి శనివారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహమ్మద్ అజారుద్దీన్, తెలంగాణ మైనార్టీ సంక్షేమ శీ అధ్యక్షులు ఫహీమ్ ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా ఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ లతో కలిసి ప్రారంభించారు.ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, పాయల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి. ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల బాలుర-2 విద్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో మైనార్టీ గురుకుల విద్యాసంస్థలను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని తెలిపారు. గతంలో విద్యా అవకాశాలకు దూరంగా ఉన్న మైనార్టీ విద్యార్థులకు ఇప్పుడు అత్యాధునిక వసతులతో కూడిన గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యే సమాజాభివృద్ధికి మూలాధారమని, మైనార్టీ యువత ఉన్నత చదువులు పూర్తి చేసి వైద్యులు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి మైనార్టీ కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ నీటి సమస్యపై ఎం సీ పీ ఐ (యూ ) ఆధ్వర్యంలో జి మ్ కు వినతి

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం జూన్ 27.





మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ కాలనీలలో ప్రజలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నారని, శాశ్వత పరిష్కారంగా ప్రత్యేక రిజర్వాయర్ నిర్మించాలని కోరుతూ ఎంసీ పీ ఐ (యూ ) మియాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి నార్త్ ట్యాంక్ డివిజన్, హఫీజ్‌పేట్ జి యం ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అత్యధిక జనాభా నివసించే బస్తీలకు మొదట నీటిని సరఫరా చేసి, ఆ తర్వాతే కమర్షియల్ ఏరియాలు, తక్కువ జనసాంద్రత ఉన్న ప్రదేశాలకు సరఫరా చేయాలని కోరారు. పేద ప్రజల తాగునీటి హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై జి యం సానుకూలంగా స్పందించారని, సదరు ప్రాంతాలను స్వయంగా సందర్శించి తగు చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర నాయకురాలు కుంభం సుకన్య, అంగడి పుష్ప, డివిజన్ సహాయ కార్యదర్శి పల్లె మురళి, ఎం.ఏ. నగర్ కమిటీ శాఖ సభ్యులు వెంకటాచారి, ఇంద్ర, అమీనా బేగం, స్థానిక బస్తీ వాసులు వేణుగోపాల్ రెడ్డి, జగదీష్, బాల్కొండయ్య, పావని, వీరమణి, ఎన్ . లక్ష్మి తదితరులు సుమారు 30 మంది పాల్గొన్నారు.

# మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ధ్వజస్తంభ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 27:(తెలంగాణ పత్రిక):-





నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం నందు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ధ్వజస్తంభ ఊరేగింపు కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులతో కలిసి ధ్వజస్తంభ ఊరేగింపులో పాల్గొని, కోలాట ప్రదర్శన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులను కలిసి మహోత్సవం విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దేవాలయాలు భారతీయ సంస్కృతి ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 27



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ జిల్లా వైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన జూమ్ సమీక్ష సమావేశంలో పల్స్ పోలియో, కార్యక్రమం పై కీలక సూచనలు చేశారు. జూన్ 28 నుండి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాలో 0--5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 98 818 మంది 0-5 సంవత్సరంలోపు పిల్లలకు పోలియో చుక్కలు ఇవ్వడం జరుగుతుంది. మొత్తం925 బూత్ లు ,38 ట్రాన్సిట్ పాయింట్లు , 1001టీములు ఏర్పాటు చేయడం జరిగింది పల్స్ పోలియో కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడం, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. అదేవిధంగా పల్స్ పోలియో బ్యానర్ను కూడా ఆవిష్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో డా రాకేష్ ప్రోగ్రాం అధికారి, డా ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సిహెచ్ఓ నాగభూషణం హెచ్ ఇ వో రాంప్రసాద్, రామారావు, హరికృష్ణ , ప్రియా నర్సింగ్ ఆఫీసర్, పాల్గొన్నారు

# 18 వేల అడుగుల ఎత్తులో స్కైడైవింగ్ చేసిన భారతీయ తాత

-ధైర్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన వైనం

తెలంగాణ పత్రిక జూన్ 27 న్యూస్ డెస్క్:



వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపించారు ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఓ భారతీయ వృద్ధుడు. సాధారణంగా 18 వేల అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేయాలంటేనే యువకులే వెనుకడుగు వేస్తారు. కానీ,ఈ తాత మాత్రం అపారమైన ఆత్మవిశ్వాసంతో ఆ సాహసాన్ని విజయవంతంగా పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో వైరల్ గా మారింది.ఈ సందర్భంగా స్కైడైవింగ్‌కు ముందు ఆయన మనవడు "మీకు భయంగా ఉందా?" అని అడగ్గా,చిరునవ్వుతో "భయపడటానికి నేను ఎవరు?" అని ధైర్యంగా సమాధానం ఇవ్వారు.అనంతరం విమానం నుంచి దూకే సమయంలో"జై హింద్..జై భారత్..జై హరియాణా" అంటూ నినాదాలు చేయడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది.ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా నెటిజన్లు తాత ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ,' 'వయసు కాదు. మనసే మనిషిని గొప్పవాడిని చేస్తుంది", "ఇలాంటి ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ ఆదర్శం" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కలలు కనడానికి,కొత్త సాహసాలు చేయడానికి జీవితాన్ని ఆస్వాదించడానికి వయసు అడ్డంకి కాదు.ధైర్యం,ఆత్మవిశ్వాసం ఉంటే అసాధ్యం అనుకున్నదీ సాధ్యమేనని నిరూపించాడు ఈ భారతీయ తాత.

# కామారెడ్డి జిల్లాలో అక్రమ వేటగాళ్ల ముఠా అరెస్ట్






-ఆపరేషన్ కవచ్'లో జంతువుల అక్రమ వేటగాళ్ల ముఠా గుట్టురట్టు 8 మంది నిందితుల అరెస్ట్...
-5 నాటుతుపాకులు, 1 ఎయిర్ గన్, భారీగా వేట సామగ్రి, 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం...
-ఆపరేషన్ కవచ్‌లో మరో కీలక కేసు ఛేదించిన గాంధారి పోలీసులు...
-నేరస్థులకు సింహస్వప్నం 'ఆపరేషన్ కవచ్'- ప్రజల భద్రతే మా లక్ష్యం....
-వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి తెలంగాణ పత్రిక

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ చట్టవ్యతిరేక అక్రమ కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆపరేషన్ కవచ్" కార్యక్రమం మరోసారి అద్భుత ఫలితాన్ని ఇచ్చింది. అడవి జంతువుల అక్రమ వేటకు పాల్పడుతున్న 8 మంది సభ్యులు గల ముఠాను గాంధారి పోలీసులు పట్టుకోవడం, నేరస్తుల వద్ద నుంచి భారీగా నాటుతుపాకులు, పేలుడు పదార్థాలు, వేట సామగ్రిని స్వాధీనం చేసుకుని జిల్లాలో అక్రమ కార్యకలాపాలకు తావులేదని తెలియజేశారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 24 న రాత్రి సమయంలో గాంధారి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొండి సడక్ చౌరస్తా వద్ద గాంధారి ఎస్ఐ మహేందర్, పోలీసు సిబ్బంది "ఆపరేషన్ కవచ్" లో భాగంగా ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు మోటార్ సైకిళ్లపై ఐదుగురు వ్యక్తులు వచ్చి పోలీసుల వాహన తనిఖీలు ముమ్మరంగా చేయడం గమనించి కొంత దూరం నుండే వెనుదిరిగి పారిపోవడానికి ప్రయత్నించారు. గాంధారి ఎస్ఐ, సిబ్బంది వెంటనే స్పందించి, అత్యంత చాకచక్యంగా వారిని వెంబడించి పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద అక్రమ నాటుతుపాకులు, గన్‌పౌడర్, పొటాష్, స్టీల్ పెలెట్స్ (చెర్రలు), ఫెల్ట్స్ తదితర ప్రమాదకర వేట సామగ్రి లభ్యమవడంతో, పట్టుబడినవారు పొంతన లేని సమాధానాలు చెప్పడముతో పోలీసులు ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని లోతైన దర్యాప్తు ప్రారంభించారు. జిల్లాలో అక్రమంగా తుపాకులు, పేలుడు పదార్థాలతో ముఠా సంచరిస్తున్న సమాచారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర సూచనల మేరకు పట్టుబడిన వారియొక్క పూర్తి నెట్వర్క్ ఛేదించడానికి ,ఆయుధాలను రికవరీ చేయడానికి పక్కా ప్లాన్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ దిశానిర్దేశంలో, ఎల్లారెడ్డి డీఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో.. సదాశివనగర్ సీఐ, గాంధారి, తాడ్వాయి ఎస్ఐ సిబ్బందితో కూడిన మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి అత్యంత సమన్వయంతో విచారణను వేగవంతం చేశాయి. పోలీసుల విచారణలో పట్టుబడిన నిందితులు అడవి జంతువుల వేట కోసం అక్రమంగా నాటుతుపాకులను కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు తెలిసింది. జంతువుల అక్రమ వేటకు అటవీ ప్రాంతానికి వెళ్లినప్పటికీ వర్షం పడడంతో అనుకూలించక వెనుతిరుగు సమయం లో పోలీసుల తనిఖీల్లో చిక్కినట్లు వెల్లడించారు. తనిఖీలలో విస్లావత్ గోపీచంద్ నడుపుతున్న బజాజ్ మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి నాటుతుపాకీతో ఉండగా, ఆంగోతి లక్ష్మణ్ నడుపుతున్న హెచ్‌ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌పై విస్లావత్ నాను వేట సామగ్రి ఉన్న సంచితో, విస్లావత్ గణేష్ మరో నాటుతుపాకీతో ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్పాట్ లోనే వారి నుండి 2 నాటుతుపాకులు, సామగ్రి, 2 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నెట్వర్క్ గురించి ఆరా తీయగా సుమారు మూడు నెలల క్రితం ఆంగోత్ ధర్మ నాయక్, సలావత్ చందర్ ల మధ్యవర్తిత్వంలో, బాన్సువాడ మండలంలోని చిన్నరాంపూర్ గ్రామానికి చెందిన అస్లాం చావుస్ వద్ద నుంచి ఒక్కో నాటుతుపాకిని రూ.10,000/- చొప్పున కొనుగోలు చేసినట్లు నిందితులు విచారణలో వెల్లడైదన్నారు. తాము కొనుగోలు చేసిన మొత్తం ఐదు నాటు తుపాకులలో మూడింటికి ట్రిగ్గర్ మెకానిజంలు లేకపోవడంతో వాటిని గండివేట్ తండా సమీపంలోని వ్యవసాయ పొలంలో దాచిపెట్టినట్లు తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక బృందాలు వెంటనే గండివేట్ తండా పరిసర ప్రాంతాల్లో గాలింపు సోదాలు నిర్వహించి, అక్కడ దాచిపెట్టిన మరో 3 నాటు తుపాకులను రికవరీ చశారు. ఈ కేసు దర్యాప్తును కొనసాగిస్తూ.. ప్రత్యేక బృందాలు చిన్నరాంపూర్ గ్రామ సమీపంలోని ఒక కోళ్ల ఫారం (పౌల్ట్రీ ఫామ్) వద్ద షెల్టర్ తీసుకున్న మిగతా నిందితులైన సలావత్ చందర్ (ఏ -6), ఆంగోత్ ధర్మ నాయక్ ఏ ధర్మ (ఏ -7), ప్రధానంగా నాటు తుపాకులు సరఫరా చేసిన అస్లాం చావుస్ (ఏ -8) లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి వేటకు ఉపయోగించే మరో 3 చాప్స (బర్రెల్స్ ), 1-ఎయిర్ గన్, 3-ట్రిగ్గర్ మెకానిజంలు, స్టీల్ పెలెట్స్ (చెర్రలు) లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా అక్రమ వేట ముఠా యొక్క పూర్తి నెట్వర్క్ కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి కోర్ట్ ముందు హాజరుపరిచారు. అరెస్టు చేయబడిన నిందితులు (ఏ -1) -- విస్లావత్ అరుణ్ , విస్లావత్ గోపిచంద్ (ఏ -2) -- ఆంగోత్ లక్ష్మణ్ (ఏ -3) విస్లావత్ నాను (ఏ -4) --విస్లావత్ గణేష్ (ఏ -5) -- ఏ 1 టూ ఏ 5 గండివేట్ తండా, గాంధారి మండలం, (ఏ 6) సలావత్ చందర్, హాజీపూర్ గ్రామం, నస్రుల్లాబాద్. (ఏ -7) ఆంగోత్ ధర్మ నాయక్ ఏ ధర్మ, నాగధార్ రాంచందర్ తండా, నిజాంపేట్ మండలం, సంగారెడ్డి జిల్లా, (ఏ -8) అస్లాం చావుస్, చిన్నరాంపూర్ గ్రామం, బాన్సువాడ మండల ల నుండి స్వాధీనం చేసుకున్నారు. నాటు తుపాకులు-5, ఎయిర్ గన్-1, ట్రిగ్గర్ మెకానిజంలు- 3, చాప్స (బర్రెల్స్ )- 3, మందుగుండు ఉ వేట సామగ్రి- స్టీల్ పెలెట్స్ (చెర్రలు), గన్‌పౌడర్, పొటాష్, ఫెల్ట్స్, ఇతర సామాగ్రి, వాహనాలు- 2 (బజాజ్ హెచ్ఎఫ్ డీలక్స్), అక్రమ ఆయుధాల సరఫరా, వన్యప్రాణుల వేట ముఠా నెట్వర్క్ ను సమర్థవంతంగా ఛేదించి, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్న సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్, తాడ్వాయి ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది సంతోష్, పెంటయ్య, హోంగార్డ్ వీరప్రసాద్‌లను కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి వారికి నగదు బహుమతులు (రివార్డులు) అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమ ఆయుధాల సంస్కృతికి, వన్యప్రాణుల వేటకు తావులేదని హెచ్చరించారు. నేరస్థులకు సింహస్వప్నంగా, ప్రజలకు రక్షణకు భరోసాగా "ఆపరేషన్ కవచ్" ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా యస్ పి రాజేష్ చంద్ర స్పష్టం చేశారు.

# వి.బి.జి.రామ్‌జీ బిల్లును వెంటనే రద్దు చేయాలి

-జూలై 1 గ్రామీణ సమ్మెను విజయవంతం చేయండి
-సీఐటీయూ,రైతు,వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

తెలంగాణ పత్రిక జూన్ 27 సూర్యాపేట:



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.జి.రామ్‌జీ బిల్లు గ్రామీణ పేదలు,వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉందని,ఈ బిల్లును వెంటనే రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ,వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు,రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి మాట్లాడుతూ,ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 1న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట నిర్వహించే గ్రామీణ సమ్మె, ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచే చర్యలను వెంటనే విరమించుకోవాలని వారు కోరారు.పని కోరిన కూలీలకు తగినంత ఉపాధి కల్పించడం లేదని,చేసిన పనులకు కూలి చెల్లింపులు వారాలు, నెలల తరబడి ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచకపోవడంతో ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం, పనిదినాలను పరిమితం చేయడం,సాంకేతిక నిబంధనలపేరుతో కూలీలపై ఆంక్షలు విధించడం వల్ల గ్రామీణ పేదల జీవనం సంక్షోభంలో పడిందని విమర్శించారు.ఇటువంటి పరిస్థితుల్లో వి.బి.జి.రామ్‌జీ బిల్లు అమల్లోకి వస్తే ఉపాధి అవకాశాలు మరింత తగ్గి,ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే వి.బి.జి.రామ్‌జీ బిల్లును రద్దు చేసి,ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించడంతో పాటు,పని కోరిన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలని, పెండింగ్ కూలి బకాయిలను వెంటనే చెల్లించాలని, పథకానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూలై 1న నిర్వహించే గ్రామీణ సమ్మెలో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు,రైతులు, మహిళలు,యువత,ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## భద్రాచలం గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయం: ఎమ్మెల్సీ తాతా మధు



తెలంగాణ పత్రిక జూన్ 27 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

"పదవి కోసమే పార్టీ మారిన వారికి ఇక్కడి కార్యకర్తలే గుణపాఠం చెబుతారు; రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని మరింత సుసంపన్నం చేస్తాం" భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గం ఉద్యమాలకు, నిస్వార్థ త్యాగాలకు పురిటిగడ్డ అని, ఈ ప్రాంతంలో భారత్ రాష్ట్ర సమితి క్షేత్రస్థాయిలో అత్యంత పటిష్టమైన ప్రజా బలాన్ని కలిగి ఉందని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ స్పష్టం చేశారు. భద్రాచలంలో ఈరోజు నిర్వహించిన ఐదు మండలాల (వాజేడు, వెంకటాపురం, చెర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం) ముఖ్య నాయకులు, కార్యకర్తల, బూత్ లెవెల్ ఏజెంట్లు తో విస్తృత స్థాయి సన్నాహక సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్ర రావు, మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ లతో కలిసి పాల్గొని దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో పార్టీ శ్రేణులు రాత్రింబవళ్లు కష్టపడి గెలిపించిన ప్రజాప్రతినిధి, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయించి కార్యకర్తల నమ్మకాన్ని, ప్రజా తీర్పును వమ్ము చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదవీ ప్రమాణ స్వీకారం చేసి, కాలి పాదాల తడి ఆరకముందే సిద్ధాంతాలను పక్కనబెట్టి పార్టీ మారిన సదరు నాయకుడికి రాబోయే రోజుల్లో ఇక్కడి చైతన్యవంతమైన కార్యకర్తలే రాజకీయ గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో ఆ ప్రజాప్రతినిధి ఒంటరి కావడం ఖాయమని, గులాబీ సైనికులు కసితో పనిచేసి ఈ గడ్డపై మళ్లీ పార్టీ జెండాను సగర్వంగా ఎగరేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలోనే భద్రాచలానికి అసలైన ప్రగతి: గత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల దశాబ్దాలుగా గిరిజన గూడేలు చీకట్లోనే మగ్గిపోయాయని, కనీసం త్రీ-ఫేజ్ కరెంట్ కూడా లేని దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకొని భద్రాచలం ఏజెన్సీ ప్రాంతమంతటా త్రీ-ఫేజ్ విద్యుత్ లైన్లను యుద్ధప్రాతిపదికన మంజూరు చేశారని కొనియాడారు. గిరిజన బిడ్డల దశాబ్దాల కల అయిన పోడు భూముల హక్కుల (పట్టాల) పంపిణీని విజయవంతంగా పూర్తి చేసి, వారికి రైతుబంధు ఆర్థిక సాయాన్ని అందించిన ఘనత కేసీఆర్ గారి ప్రభుత్వానిదేనన్నారు. భద్రాచలం ప్రాంత సాగునీటి అవసరాలను తీర్చేందుకు, సీతారాముల ఆలయ సమీపం నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందిస్తామన్న హామీకి తాము నేటికీ కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు.నిస్వార్థ కార్యకర్తలకు సముచిత స్థానం త్వరలోనే భారీ బహిరంగ సభ: పదవులను ఆశించి వెళ్లే అవకాశవాదులు, దొంగలు పార్టీని వీడినా.. పార్టీని ప్రాణంగా ప్రేమించే అసలైన సైనికులు నేటికీ గులాబీ జెండా నీడలోనే ఉన్నారని తాతా మధు గారు పేర్కొన్నారు. సొంత జేబుల నుండి డబ్బులు ఖర్చు పెట్టుకుంటూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న ప్రతి కార్యకర్తను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, రాబోయే రోజుల్లో వారందరికీ సముచిత రాజకీయ స్థానం దక్కుతుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవీంద్రరావు , మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మరియు తామంతా భద్రాచలం శ్రేణులకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ప్రాంత కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు త్వరలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు ఆధ్వర్యంలో భద్రాచలంలో ఒక భారీ బహిరంగ సభను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రతికూల వాతావరణాన్ని, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఐదు మండలాల నుండి వేలాదిగా తరలివచ్చి ఈ సమావేశాన్ని దిగ్విజయం చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రతీ ఒక్కరూ ప్రజాక్షేత్రంలో ఉంటూ, ప్రజల పక్షాన పోరాటాలు సాగించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ విస్తృత స్థాయి సమావేశంలో భద్రాచలం బిఆర్ఎస్ ముఖ్య నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, గుడవర్తి నరసింహమూర్తి, బోధబోయిన బుచ్చయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు, దొడ్డి తాతా రావు, కృష్ణ రెడ్డి, మరియు నాయకులు ఆకోజు సునీల్, ప్రబోధ్ కుమార్, నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ఐదు మండలాల మాజీ ప్రజాప్రతినిధులు (సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు), మరియు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

-ప్రతి 5 సంవత్సరాల చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో చుక్కలు వేయించండి..
-జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు

తెలంగాణ పత్రిక జూన్ 27 ఖమ్మం



భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 28 నుండి 30, 2026 వరకు జిల్లాలో ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తెలిపారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి రెండు చుక్కల బైవేలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వల్ల 2011 సంవత్సరం నుండి జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని ఈ విజయాన్ని కొనసాగించేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం కోసం 950 పోలియో బూత్‌లు 30 మొబైల్ బృందాలు 30 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు 4,375 మంది సిబ్బంది 108 మంది పర్యవేక్షకులు మరియు 120 వాహనాలు వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 1,31,642 మంది 0--5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అవసరమైన 1,44,000 డోసులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.జూన్ 28 (ఆదివారం) నాడు సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు ప్రతి తల్లిదండ్రులు తమ 0--5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని ఆ రోజు బూత్‌కు రాలేని పిల్లలకు జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటికి వెళ్లే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయబడతాయని తెలిపారు.పిల్లలు ఇప్పటికే అన్ని టీకాలు తీసుకున్నా ఆరోగ్యంగా ఉన్నా గతంలో పల్స్ పోలియో చుక్కలు వేయించుకున్నా కూడా ఈసారి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని డిఎంహెచ్ఓ డా. డి రామారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రతి చిన్నారికి రెండు చుక్కలు -- పోలియో రహిత సమాజమే మన లక్ష్యం అని పేర్కొంటూ ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు గ్రామ పెద్దలు ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ సిబ్బంది మరియు ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అసలు నిందితులు దొరికినా..మాపై పడిన నింద మాత్రం పోలేదు

-నల్లగొండ నాలుగు హత్యల కేసులో మాపై ఆరోపణలు
-ఒకవైపు తల్లిని కోల్పోయి, మరోవైపు నిందలతో బాధగా ఉంది
-జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బుష్రా,అర్ఫాన్



తెలంగాణ పత్రిక జూన్ 27 నల్లగొండ:

నాలుగు హత్యల కేసులో అసలు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఊపిరి పీల్చుకున్న బుష్రా,అర్ఫాన్..తమను నిర్దోషులుగా నిర్ధారించిన జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.అయితే, ఆధారాలు లేకుండానే తమ ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ హంతకులుగా ప్రచారం చేయడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు."ప్రేమించి పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో ప్రశాంతంగా జీవిస్తున్నాం.కానీ, చేయని నేరానికి మమ్మల్ని దోషులుగా చిత్రీకరించారు.అసలు నిందితులు దొరికినా ఇప్పటికీ చాలామంది మమ్మల్నే అనుమానంతో చూస్తున్నారు.మా పరువు,మా జీవితం తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని కన్నీటి పర్యంతమయ్యారు."మా తల్లిని కోల్పోయిన బాధ ఒకవైపు..చేయని నేరానికి మమ్మల్ని నిందించిన బాధ మరోవైపు వెంటాడుతోంది" అని బుష్రా భావోద్వేగానికి లోనయ్యారు. సోషల్ మీడియా,యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర వేదికల్లో తమ ఫోటోలతో ఉన్న తప్పుడు పోస్టులను వెంటనే తొలగించాలని కోరారు.వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరినీ నిందితులుగా ప్రచారం చేయవద్దని మీడియా,సోషల్ మీడియా వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. మీడియా అత్యుత్సాహంపై విమర్శలు ఈ ఘటన మరోసారి నిజాలు వెలుగులోకి రాకముందే కొంతమంది మీడియా సంస్థలు,సోషల్ మీడియా వేదికలు తీర్పులు చెప్పే ధోరణి ఎంత ప్రమాదకరమో గుర్తు చేసింది. అధికారిక దర్యాప్తు పూర్తి కాకముందే వ్యక్తుల ఫోటోలు,పేర్లను ప్రచారం చేయడం వల్ల నిర్దోషుల పరువు,వ్యక్తిగత జీవితం, కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఈ సంఘటన స్పష్టం చేసింది.వార్తల్లో వేగం ఎంత ముఖ్యమో,వాస్తవ నిర్ధారణ కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

# రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

తెలంగాణ పత్రిక ప్రతినిధి



ఖమ్మం జిల్లాలో అవినీతిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. ముదిగొండ మండలం భానాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేష్ రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, భవన నిర్మాణ అనుమతి (బిల్డింగ్ పర్మిషన్) మంజూరు చేయడంతో పాటు ఇంటి నంబర్ కేటాయించే ఒదుకు ఫిర్యాదుదారుని నుంచి రూ.25,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో ఖమ్మం రేంజ్ ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని, ముదిగొండ మండలంలోని రితు వేదిక సమీపంలో లంచం స్వీకరిస్తున్న సమయంలో కార్యదర్శిని పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.25 వేల లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, అతడిని అరెస్టు చేసి వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది. అధికారులు ఎవరైనా ప్రజా సేవల కోసం లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ప్రజలకు సూచించారు..

# ఇందిరమ్మ ఇళ్లు స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

-మొదటిపేజీ తరువాయి తెలంగాణలో ఇంరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుం. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు ఫిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసిం. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఇంరమ్మ ఇళ్ల స్లాబ్‌ను 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. స్లాబ్ ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ముందువైపు మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్క అడుగుకు మించరాదని స్పష్టం చేశారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలతో పాటు, ప్రస్తుతం బేస్‌మెంట్ లేదా రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు కూడా ఈ




నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. చాలామం లబ్ధిదారులు అవసరానికి మించి పెద్ద సైజులో స్లాబులు వేస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరుగుతోందని గృహ నిర్మాణ సంస్థ గుర్తించిం. గోడల నుంచి ఎనిమి అడుగుల వరకు కూడా స్లాబులను పొడిగిస్తున్న సందర్భాలు ఉన్నాయని, దీనివల్ల పేద లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ పరిమితులు ఫించి.ఎండ, వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిం. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంని ప్రభుత్వం ఆదేశించింది.

# నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లతో

## తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్







-115 వాహనాలు సీజ్

తెలంగాణ పత్రిక జూన్ 27 కరీంనగర్ :

తప్పు నంబర్ ప్లేట్లు, నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కఠిన చర్యలు ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్‌టౌన్ కార్నర్ వద్ద చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, తప్పుగా అమర్చిన నంబర్ ప్లేట్లు, అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 115 వాహనాలను సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం సంబంధిత నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి మాట్లాడుతూ, ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా స్పష్టంగా కనిపించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉండాలని తెలిపారు. నంబర్ ప్లేట్లను మార్చడం, స్టిక్కర్లు లేదా ఇతర డిజైన్లతో నంబర్లు కనిపించకుండా చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్యతో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శని త్రయోదశి వేళ భీమేశ్వరుడిని దర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తెలంగాణ పత్రిక జూన్ 27 వేములవాడ :



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయానికి విచ్చేసిన ప్రభుత్వ విప్‌కు అర్చకులువేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు.శని త్రయోదశి సందర్భంగా ఆలయంలోని నవగ్రహ మండపంలో శనీశ్వర స్వామివారికి నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించారు. నల్ల వస్త్రం సమర్పించి, నవధాన్యాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. శని దోష నివారణ కోసం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వామి వారి తీర్థప్రసాదం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందించి వేదాశీర్వచనాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓలు జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నూగూరి నరేందర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143